క్లుప్తంగా

జగన్‌ను కలిసిన ముస్లిం నాయకుడు నజీరుద్దీన్‌ఖాన్



మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో నజీరుద్దీన్‌ఖాన్

నిడదవోలు రూరల్: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సమిశ్రగూడెం గ్రామానికి చెందిన ముస్లిం మైనార్టీ నియోజకవర్గ నాయకుడు ఎస్‌కే నజీరుద్దీన్‌ఖాన్ తాడేపల్లిలోని కేంద్ర కార్యాలయంలో గురువారం కలిశారు. ముస్లింల సమస్యలను జగన్‌కు విన్నవించారు.

సేంద్రియ సాగుతో అనేక ఉపయోగాలు

రాజమహేంద్రవరం రూరల్: సేంద్రియ సాగుతో రైతులకు అనేక ఉపయోగాలు కలుగుతాయని జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు అన్నారు. ఈ విధానంలో పండించిన ఉత్పత్తులను 126 దేశాలలో ఇండ్ గాప్ పొలంబడి ద్వారా రైతులు విక్రయించుకునే అవకాశం ఉందన్నారు. మండలంలోని రాజవోలులో గురువారం నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. డాట్ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ వరిని ఆశించే చీడ పీడలు, తెగుళ్లకు సంబంధించి రైతులకు సూచనలు చేశారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా నీమస్త్రం తయారీ, ఉపయోగించే విధానాలపై అవగాహన కల్పించారు. వరిని ఆశించే రసం పీల్చే పురుగు, పేను బంక, తామర పురుగు, ఎర్ర నల్లి, తెల్లదోమలను గుడ్డు దశలో నియంత్రించటానికి నీమస్త్రం సమర్థవంతంగా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో ఏడీఏ శ్రీనివాసరెడ్డి, మండల వ్యవసాయాధికారి భీమరాజు, ఏఈవో పీటర్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయంలో చోరీ



అమ్మవారి ఆలయంలో దుండగులు పగలుగొట్టిన హుండీ

దేవరపల్లి: గౌరీపట్నం శివారు కొండగూడెంలోని కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. గుండుగొలను-కొవ్వూరు జాతీయ రహదారికి సుమారు కిలోమీటరు దూరంలో ఉన్న క్వారీ ప్రాంతంలో అమ్మవారి పురాతన ఆలయం ప్రధాన గేటు తాళం బద్దలుకొట్టి హుండీలోని నగదును దుండగులు దోచుకున్నారు. ఆలయం వద్ద ఉన్న సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. బీరువా తాళాలు బద్దలు కొట్టి అమ్మవారికి సంబంధించిన విలువైన వస్తువుల కోసం గుడిని చెల్లాచెదురు చేశారు. విలువైన వస్తువులు దొరకకపోవడంతో వెనుతిరిగారు. గురువారం ఉదయం ఆలయాని వెళ్లిన ఆలయ కమిటీ సభ్యులు జరిగిన సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

నేడు ఎన్‌ఆర్‌ఈజీఎస్ గ్రామసభలు

గోపాలపురం: మండలంలోని 18 గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల జాబితాల తయారీపై సభలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో ఆర్.శ్రీదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పనుల వివరాలు నమోదుకు మండలంలోని వివిధ శాఖల అధికారులను నియమించినట్టు తెలిపారు.

చవితి ఉత్సవంపై సమావేశం

చాగల్లు: స్థానిక తహసీల్దార్ ఎం.మేరికమ్మ గురువారం తన కార్యాలయంలో వినాయక చవితి ఉత్సవ కమిటీ నిర్వాహకులతో ఉత్సవాలపై సమీక్షించారు. ఉత్సవాల్లో మట్టి విగ్రహాలను మాత్రమే పెట్టాలని, ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం కలుగకుండా చూడాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వర్తక సంఘం కమిటీ అధ్యక్షుడు గ్రంధి రాంబాబు, తెలగ సంఘం కమిటీ సభ్యులు గంగ్రోతు సురేంద్ర కుమార్, జుట్ట ఏడుకొండలు, పిండి మంగరాజు దాసరి కృష్ణమూర్తి, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ట్యాబ్ ఆధారిత ఆన్‌లైన్ పరీక్షలు

కంబాలచెరువు: సీబీఎస్‌ఈ తరగతులు నిర్వహిస్తున్న పాఠశాలల్లో ట్యాబ్ ఆధారిత ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు రాజమహేంద్రవరం డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ఈవీబీఎన్ నారాయణ తెలిపారు. స్థానిక లాలాచెరువు నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పరీక్షలను గురువారం ఆయన పరిశీలించారు.

ఆయాల ఆకలి కేకలు

- నాలుగు నెలలుగా అందని వేతన బకాయిలు
- ఒక్కో ఆయాకు నెలకు రూ.6 వేలు వేతనం
- ఎప్పుడిస్తారో స్పష్టంగా చెప్పని అధికారులు
- పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం

నల్లజర్ల: కూటమి ప్రభుత్వం చిరుద్యోగులను చిన్నచూపు చూస్తోంది. పని చేస్తే తప్ప పొట్టనిండని వారిని పస్తులుండేలా చేస్తోంది. ఒక్క నెల జీతం ఆగినా కుటుంబం గడవని స్థితి ఉన్న కార్మికులకు నాలుగు నెలలుగా వేతనం అందించకుండా ఆవేదనకు గురి చేస్తోంది. జీతాలు సక్రమంగా అందక అప్పులు చేసి ఇబ్బంది పడుతున్నామని పాఠశాలలను శుభ్రం చేస్తున్న ఆయాలు, రాత్రివేళ కాపలా ఉండే వాచ్‌మెన్లు వాపోతున్నారు.

వేతనాలు అందక..

ప్రభుత్వ పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచేందుకు, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆయాలను, నైట్ వాచ్‌మెన్లను నియమించింది. వారికి నెలకు రూ.6వేల గౌరవ వేతనం ఇచ్చేలా ఏర్పాటు చేసింది. పాఠశాలలో 300 మంది విద్యార్థులుంటే ఒకరు, 600 మంది ఉంటే ఇద్దరు, 900 మంది ఉంటే ముగ్గురు ఆయాలు, 900కు పైగా విద్యార్థులుంటే నలుగురు లెక్కన ఆయాలను నియమించారు. వీరికి ప్రభుత్వం విద్యార్థుల తల్లులకు అందించే అమ్మఒడి పథకం నుంచి వేతనం ఇచ్చేవారు. అమ్మ ఒడి పథకంలో తల్లులకు ఇచ్చే రూ.15 వేల నుంచి వెయ్యి రూపాయలను పక్కన పెట్టి వారికి వేతనం అందిస్తున్నారు. ఇలా కుటుంబ పోషణకు జీతం ఆసరాగా ఉంటుందనే ఆశతో పలువురు మహిళలు ఆయాలుగా పనిచేస్తున్నారు. వీరు పాఠశాల తరగతి గదులు, ప్రాంగణాలు, మరుగుదొడ్లు తదితర వాటిని ఆయాలు పరిశుభ్రంగా ఉంచుతున్నారు. మధ్యాహ్న భోజనం తర్వాత వ్యర్థాలను తొలగిస్తున్నారు. మొక్కల సంరక్షణ చూస్తున్నారు. రాత్రి సమయంలో పాఠశాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వాచ్‌మెన్లు కాపలాగా ఉంటున్నారు. వీరికి ఈ ఏడాది మార్చి వరకు జీతాలు ఠంచన్‌గా ఇవ్వగా ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకూ వేతనాలు బకాయిలు ఉన్నాయి. ప్రస్తుత ప్రభుత్వం పట్టించుకోవడంలేదు. మండలంలో 56 పాఠశాలలు ఉండగా 9,600 మంది విద్యార్థులు ఉన్నారు. వీరి కోసం 56 మంది ఆయాలు పనిచేస్తున్నారు. 9 హైస్కూళ్లలో తొమ్మిది మంది వాచ్‌మెన్లు పనిచేస్తున్నారు.

ప్రభుత్వం మారడంతో..

సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ సమయంలో వీరికి ఆగిన జీతాలు బడులు తెరిచి రెండు నెలలైనా అందలేదు. ప్రభుత్వం మారడంతో అసలు వీరిని విధి నిర్వహణలో కొనసాగిస్తారా? తొలగిస్తారా ? అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. కూటమి ప్రభుత్వంలో ప్రతి విద్యార్థికి తల్లికి వందనం పేరుతో రూ.15వేలు ఇస్తామన్న హామీ ఈ ఏడాది అటకెక్కింది. దీంతోప్రభుత్వం ఆయాలు,నైట్ వాచ్ మెన్లపై ఎటువంటి నిర్ణయం తీసుకుంటుందోనన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.



మరుగుదొడ్లు శుభ్రపరుస్తున్న ఆయా సుబ్బాయమ్మ

భారమైన కుటుంబ పోషణ



మాకు నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదు. కుటుంబపోషణ భారంగా ఉంది. జీతాలు ఎప్పుడిస్తారని అడిగితే తమకు తెలియదని హెడ్ మాస్టర్లు చెబుతున్నారు. ఇప్పటికైనా మా బాధలు గుర్తించి జీతాలు వెంటనే చెల్లించాలి. – భారతి, ఆయా, పోతవరం హైస్కూలు

గతంలో సమయానికి అందేవి



మాకు రావాల్సిన జీతాలు అందకపోవడంతో పరిస్థితి ఇబ్బందికరంగా ఉంది. గతంలో ప్రతి నెలా సమయానికి జీతాలు ఇచ్చేవారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ పాఠశాలలోనే ఉంటున్నాం. మరో పనిచేయడానికి వీలుండడంలేదు. అధికారులు మా బాధను అర్థం చేసుకుని జీతాలు అందించాలి. – చంద్ర, ఆయా, పోతవరం

బడ్జెట్ రాగానే చెల్లిస్తాం



వేతన బకాయిలు ఉన్నమాట వాస్తవమే. సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బడ్జెట్ ప్రతిపాదిస్తే అసిస్టెంట్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ ద్వారా జిల్లాకు నిధులు మంజూరవుతాయి. అవి వచ్చిన వెంటనే ఆయాలకు, నైట్ వాచ్‌మెన్లకు జీతాలు అందిస్తాం. – వై.సత్యనారాయణ, ఎంఈఓ–1, నల్లజర్ల

నిడదవోలు సీఐగా శ్రీనివాసరావు



నిడదవోలు: స్థానిక సీఐగా వి.శ్రీనివాసరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. రాజమహేంద్రవరం టూటౌన్ నుంచి సాధారణ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పని చేసిన సీఐ జానకిరామయ్య విజయవాడ సైబర్ బ్రాంచికు బదిలీ అయ్యారు. ఈసందర్భంగా సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణ, మహిళల రక్షణకు, గంజాయిపై నిఘా ఉంచి నిర్మూలనకు కృషి చేస్తానన్నారు.

నిడదవోలు మున్సిపల్ కమిషనర్‌గా కృష్ణవేణి



నిడదవోలు: పట్టణ నూతన మున్సిపల్ కమిషనర్‌గా టీఎల్‌పీఎస్ఎస్ కృష్ణవేణిని ప్రభుత్వం నియమించింది. పల్నాడు జిల్లా వినుకొండ మున్సిపాలిటీ నుంచి ఆమె ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న మున్సిపల్ కమిషనర్ టి. రాంభూపాల్‌రెడ్డి డీఎంఏ కార్యాలయంలో రిపోర్టు చేశారు.

రేపు మండల సమావేశం

దేవరపల్లి: స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం మధ్యాహ్నం 2.30 గంటలకు ఎంపీపీ కేవీకే దుర్గారావు అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీఓ పి.ప్రభాకరరావు తెలిపారు. వివిధ శాఖల అధికారులు ప్రగతి నివేదికలతో హాజరుకావాలని ఆయన కోరారు.

పార్టీ మారతామనే దుష్ప్రచారాన్ని నమ్మవద్దు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ

నిడదవోలు: పార్టీ మారతామనే దుష్ప్రచారాన్ని ఎవరు నమ్మవద్దని, వైఎస్సార్ సీపీలో ఉంటూ మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి జి.శ్రీనివాస్ నాయుడు నాయకత్వంలో ఉంటామని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ స్పష్టం చేశారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఆయన కౌన్సిలర్లతో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు సమక్షంలో నా చైర్మన్ పదవి రెండేళ్ల ఆరు నెలలు, మరో కౌన్సిలర్ కామిశెట్టి సత్యనారాయణకు రెండేళ్లు, కౌన్సిలర్ పువ్వల రతీదేవికి ఆరు నెలలు చైర్మన్ పదవి చేపట్టడానికి ఒప్పందం కుదిరిన తరువాత చైర్మన్ పదవి స్వీకరించానని ఆయన పేర్కొన్నారు. అయితే తన కాల పరిమితి ముగియగానే అనుకున్న ఒప్పొందం ప్రకారం కౌన్సిలర్ కామశెట్టి సత్యనారాయణకు చైర్మన్ పదవి చేపట్టాల్సి ఉండగా ఆయన తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న సమయంలో వాయిదా పడిందన్నారు. ఈ సమయంలో సార్వత్రిక ఎన్నికల కోడ్ రావడంతో ఎన్నికలు ముగిసిన తర్వాత జరిగిన పరిణామాల దృష్ట్యా నూతన చైర్మన్ బాధ్యతలు అప్పజెప్పడానికి ఆలస్యమైందని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడి ఆదేశాలను పాటిస్తూ మేమంతా ఒకే బాటలో ఉంటామని ఆయన పేర్కొన్నారు. మేమంతా విడిపోయి వేరొక పార్టీలోకి వెళతామనే ప్రచారాన్ని ఎవరు నమ్మవద్దని ఆయన విన్నవించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ యలగడ బాలరాజు, కౌన్సిలర్లు కామిశెట్టి సత్యనారాయణ, పువ్వల రతీదేవి కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రత్యేక గ్రామ సభలు

ఉండ్రాజవరం: మండలంలో 15 గ్రామ పంచాయతీల్లో శుక్రవారం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి పనుల గుర్తింపునకు గ్రామ సభలు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో గాదిరాజు రామకృష్ణంరాజు తెలిపారు. ఉండ్రాజవరం మండల పరిషత్ కార్యాయలంలో గురువారం సచివాలయ సిబ్బంది, ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్స్‌తో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ప్రాధాన్యం ఉన్న పనులను గుర్తించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. గ్రామస్తుల నుంచి దరఖాస్తులను స్వీకరించాలని తెలిపారు.

కొవ్వూరులో..

కొవ్వూరు: మండలంలో గ్రామ పంచాయతీల్లో శుక్రవారం గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కె.సుశీల తెలిపారు. ప్రధానంగా గ్రామ అవసరాల గుర్తింపు, మెరుగైన సాధారణ సౌకర్యాలకు ప్రాధాన్యత, మెరుగైన రహదారుల నిర్మాణం ,స్వయం సంవృద్ధి మౌళిక సదుపాయాల కల్పనపై సమీక్షించనున్నట్టు తెలిపారు.ఆయా గ్రామ సర్పంచుల అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి వార్డు సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నిడదవోలు రూరల్‌లో

నిడదవోలు రూరల్: గ్రామాల్లో కొత్త పనులు గుర్తించేందుకు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ సభలు నిర్వహిస్తున్నట్టుఎంపీడీఓ పి.శామ్యూల్ తెలిపారు. కాటకోటేశ్వరంలో జరిగే గ్రామసభకు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ హాజరవుతారన్నారు.

క్రీడలతో విద్యార్థుల్లో ఏకాగ్రత



బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

నల్లజర్ల: క్రీడలతో విద్యార్థుల్లో ఏకాగ్రత పెరుగుతుందని పోతవరం హైస్కూలు హెచ్‌ఎం గోపిగోవర్ధన్ అన్నారు. గత వారం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన వివిధ ఆటల పోటీల్లో విజేతలకు గురువారం హెచ్‌ఎం, ఉపాధ్యాయులు బహుతులు అందజేశారు. వీటిని ఈశ్వర యర్త్ మూవర్స్ అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటలవల్ల విద్యార్థులలో ఏకాగ్రత, మానసిక ఉల్లాసం పెంపొందుతాయన్నారు విద్యద్వారానే వినయం, విధేయత వస్తుందని మంచి విద్యార్థిగా పేరుతెచ్చుకున్న వారు జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారన్నారు.

ఒలింపిక్స్ స్థాయికి వెళ్లడం అభినందనీయం



తాడిపర్రు ఉన్నత పాఠశాలలో జ్యోతికశ్రీని సత్కరిస్తున్న సర్పంచ్ నరేంద్ర తదితరులు

ఉండ్రాజవరం: సాధారణ కుటుంబంలో పుట్టి ఎంతో కష్టపడి, ఎన్నో విజయాలు సాధించిన జ్యోతికశ్రీ ఒలింపిక్స్ స్థాయికి వెళ్లడం అభినందనీయమని సర్పంచ్ కరుటూరి నరేంద్ర అన్నారు. తాడిపర్రు ఉన్నత పాఠశాల ఆవరణలో ఒలింపిక్స్ క్రీడాకారిణి తణుకుకు చెందిన దండి జ్యోతికశ్రీని సర్పంచ్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. పరుగుపందెంలో భారత్ తరుపున జ్యోతికశ్రీ ఒలింపిక్స్ క్రీడల్లో పాల్గొన్న విషయం తెలిసిందే. ఈసందర్భంగా జ్యోతికశ్రీని డి.ప్రసాద్, అక్కిన గోపాలకృష్ణ, వాకలపూడి సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు అభినందించారు.

అంగన్‌వాడీ, పాఠశాలలో ఆకస్మిక తనిఖీ



చాగల్లులో అంగన్‌వాడిని పరిశీలిస్తున్న దృశ్యం

చాగల్లు: రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా స్టేట్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ప్రశాంత్ గురువా గురువారం చాగల్లు పీహెచ్‌సీ పరిధిలో అంగన్‌వాడీ సెంటర్లు, పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్‌వాడీ, స్కూళ్లలో నిర్వహించే చిల్డ్రన్ హెల్త్ స్క్రీనింగ్ పనితీరు వివరాలను అడిగి తెలుసుకునర్నారు. ఆయనతో పాటు జిల్లా రాష్ట్రీయ బాల స్వస్థ్యా కార్యక్రమం ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ హరిచంద్ర, చాగల్లు ప్రైమరీ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తనూజ, జిల్లా సత్వర చికిత్స కేంద్రం సిబ్బంది, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

150 మందికి వైద్య పరీక్షలు

ఉండ్రాజవరం: ఆర్యవైశ్య సేవా సంఘం ఆధ్వర్యంలో వేలివెన్ను గ్రామంలో శ్రీవాసవి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో గురువారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో గాయత్రి ఆయుర్వేదిక్ మల్టీస్పెషాల్టీ సెంటర్ వైద్యులు డాక్టర్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ గీతాభవానీ సుమారు 150 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు అందజేశబూరు. ఈకార్యక్రమంలో బలభద్ర భాస్కరగుప్త, అత్యం నారాయణ కోటేశ్వరరావు, గొల్లపూడి సుబ్రమణ్యం, బలభద్ర చిన నరసింహమూర్తి, బలభద్ర సుబ్రహ్మణ్యం తదితర ఆర్యవైశ్య సభ్యులు పాల్గొన్నారు.

విజయదుర్గ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ



విజయదుర్గ అమ్మవారు

నల్లజర్ల: ఆవపాడులో భక్తులు నూతనంగా రూ.50 లక్షలతో నిర్మించిన ఆలయంలో గురువారం విజయదుర్గ అమ్మవారి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. వేదపండితులు వేణుగోపాలశర్మ బృందం పూజాధికాలు నిర్వహించారు. బంధువులు, పుట్టింటి ఆడపడుచుల రాకతో గ్రామం అంతా సందడి వాతావరణం నెలకొంది. గోపాలపురం శాసన సభ్యులు మద్దిపాటి వెంకట్రాజు అమ్మవారిని దర్శించుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నల్లజర్ల: లైన్ల మరమ్మతుల కారణం అనంతపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని గుండేపల్లి, ఆశ్రమం ఫీడర్లకు శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు నిడదవోలు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.వీరభద్రరావు తెలిపారు. ఈఫీడర్లలో త్రీఫేజ్ సప్లయి ఉదయం 5గంటల నుంచి 9 గంటల వరకూ తిరిగి మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు అందించనున్నట్టు చెప్పారు.

గోపాలపురం: మండలంలోని గోపాలపురం, జగన్నాథపురం విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారు.

దేవరపల్లి: మండలంలోని రామన్నపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ దేవరపల్లి ఫీడర్‌కు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వకు విద్యుత్ సరఫరా ఉండదని ఏపీఈపీడీసీఎల్ నిడదవోలు ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు బి. వీరభద్రరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

మరమ్మతుల కారణంగా..

నిడదవోలు రూరల్: మండలంలోని కాటకోటేశ్వరం సబ్‌స్టేషన్ల పరిధిలోని తిమ్మరాజుపాలెం, లింగంపల్లి, శంకరాపురం, రావిమెట గ్రామాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు.

మృతుల కుటుంబాలకు నష్ట పరిహారం అందించాలి

నిడదవోలు: అనకాపల్లి ఎసెన్షియా ఫార్మా కంపెని ప్రమాద ఘటన మృతుల కుటుంబాలకు తక్షణ నష్టం పరిహారం అందించడంతో పాటు యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ స్థానిక పశువుల ఆసుపత్రి కూడలిలో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో గురువారం ఆందోళన నిర్వహించారు. ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఈమని గ్రీష్మ కుమార్ మాట్లాడుతూ కార్మికుల భద్రత కోసం యాజమాన్య చర్యలను పర్యవేక్షించే కార్మికశాఖ అధికారాన్ని తొలగించిన ఫలితంగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రమాదంలో మరణించిన కార్మికులకు యాజమాన్యం కోటి రూపాయలు, ప్రభుత్వం నుంచి కోటి రూపాయలు, క్షతగాత్రులకు చెరో రూ.50 లక్షలు అందజేయాలన్నారు. మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ఐఎఫ్‌టీయూ జిల్లా కమిటీ సభ్యులు తీపర్తి వీర్రాజు మాట్లాడుతూ ప్రతి 6 నెలలకు పరిశ్రమలలో బాయిలర్లు, రియాక్టర్లు తదితరాల ఫిట్నెస్ పరీక్షల నిర్వహణలో అశ్రద్ధ కారణంగానే కార్మికులు మృతి చెందారన్నారన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కోనేటి మల్లేశ్వరరావు, పిచ్చా సూర్య కిరణ్, లంకాడ గణపతి, గాలి గనిరాజు, వాసు, తోరం సూరిబాబు, సుబ్బారావు, రామ్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జానపదమే సంస్కృతికి ప్రతిబింబం



జానపద కళాకారులతో విజయలక్ష్మి తదితరులు

సీటీఆర్ఐ: జీవన సమరంలో కష్టసుఖాలను బాణీలుగా చేసుకొని రూపొందించిన పాటలే జానపదాలని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. సంహిత డిగ్రీ కళాశాల, కళాగౌతమి సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ జానపద దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జానపద కళాకారులు తమ కళలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న విజయలక్ష్మి మాట్లాడుతూ పల్లె పాటలులోని విజ్ఞానం, వినోదాలు ఉండేవన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఆచార్యులు తరపట్ల సత్యనారాయణ మాట్లాడుతూ మాట నుంచి పాట ఉద్భవిస్తే, పాటకు సంగీతం జత కలిసి కళగా రూపాంతరం చెందిందని వివరించారు. సభకు అధ్యక్షత వహించిన డాక్టర్ పీవీబీ సంజీవరావు మాట్లాడుతూ పని, పాటకు మధ్య ఏర్పడిన విడదీయరాని బంధమే జానపదమన్నారు. కార్యక్రమంలో జైన సాహిత్య రాయబారి చీమలమర్రి శ్రీనివాసరావు, సంహిత డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ తోట రామకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా మానవత ఆవిర్భావ దినోత్సవం



కార్మికులకు దుస్తులు అందజేస్తున్న మానవత సభ్యులు



తాళ్లపూడిలో శాంతి ర్యాలీ చేస్తున్న విద్యార్థులు మానవత సభ్యులు



గోపాలపురం మండలం మానవత స్వచ్ఛంద సంస్థకు ఫ్రీజర్ బహూకరిస్తున్న దాతలు

నల్లజర్ల: మానవత ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం ఉదయం నల్లజర్లలో నిర్వహించారు. మానవత పతాకాన్ని రీజనల్ చైర్మన్ గుత్తికొండ వరప్రసాద్, కోశాధికారి ఐడీపీ అప్పారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పంచాయతీ పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో సమన్వయ కమిటీ చైర్మన్ కండెపు వెంకట సూర్యనారాయణ, ఉన్నమట్ల వెంకటేశ్వరావు, గుళ్లపూడి వెంకటరత్నం, పాతూరి రమేష్, ప్రత్తిపాటి గంగారావు, పాతూరి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఫ్రీజర్ అందజేత

గోపాలపురం: మానవత స్వచ్ఛంద సంస్థ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వాదాలకుంట గ్రామానికి చెందిన స్వర్గీయ జుజ్జవరపు నరసయ్య, రాములమ్మల జ్ఞాపకార్థం వారి కుమారులు రూ.70వేల విలువైన ఫ్రీజర్‌ను గురువారం మండల మానవత సంస్థకు అందజేశారు. కార్యక్రమంలో భాగంగా గోపాలపురం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మానవత మండల శాఖ చైర్మన్ జొన్నలగడ్డ రాంబాబు, ఆ శాఖ అధ్యక్షుడు పప్పు సత్యకృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడు రాపాక ఫణికిషోర్, గడ జోగేంద్రప్రసాద్, కె.కీర్తికుమార్, కొయ్య నాగరాజు, నెల్లి చంద్రశేఖర్ మానవత సభ్యులు పాల్గొన్నారు.

శాంతి ర్యాలీ

తాళ్లపూడి: ప్రపంచ శాంతి స్థాపనలో ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలని మానవత సంస్థ మండల అధ్యక్షుడు అంకెం సురేష్ అన్నారు. మండల మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ శాంతి కోసం ర్యాలీ నిర్వహించారు. మాంటిస్సోరి హైస్కూల్ విద్యార్థులతో కలిసి తాళ్లపూడిలోని బస్టాండ్ సెంటర్ వరకూ ఆయన శాంతి ర్యాలీ నిర్వహించారు. మానవత సంస్థ రీజనల్ చైర్మన్ వి.చంద్రయ్య, మండల అధ్యక్షుడు సురేష్, స్కూల్ కరస్పాండెంట్ వీవీ అనీష్, మండల మానవత సభ్యులు ఏఎస్‌వో జె.వెంకటేశ్వరరావు, గోకవరపు బాబులు, అప్పన హనుమంతరావు, సనపల రాజశేఖర్, వెంకటేష్, టీఎస్‌టీ గుప్త, పెమ్మాడి దుర్గాప్రసాద్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.